# క్రై కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 97 క్రిష్ణా, బుధవారం 31 - 12 - 2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రై కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## డిసెంబర్ 31నే ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

- జిల్లాలో 2,28,592 పెన్షన్లకు రూ. 98.95 కోట్లు విడుదల
- పేదల సేవలో స్ఫూర్తికి అనుగుణంగా పంపిణీ చేపట్టండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**పత్రికా ప్రకటన ఎన్‌టీఆర్ జిల్లా, డిసెంబర్ 30, 2025** నూతన సంవత్సరం నేపథ్యంలో డిసెంబర్ 31వ తేదీనే బుధవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టడం జరుగుతుందని.. పేదల సేవలో స్ఫూర్తికి అనుగుణంగా పెన్షన్లను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలో డిసెంబర్ 31న చేపట్టే ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల కింద 303 కొత్త పెన్షన్‌లతో కలుపుకొని 2,28,592 పెన్షన్లకు దాదాపు రూ. 98.95 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందని.. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల వద్ద పెన్షన్ల పంపిణీ సజావుగా సాగేలా కృషిచేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదల సేవలో.. స్ఫూర్తికి అనుగుణంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు సూచనలు చేశారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పెన్షన్ల పంపిణీ జరిగేలా చూడాలన్నారు. పంపిణీ సమయంలో ఇబ్బందిలేకుండా ఉండేందుకు పెన్షన్ రకాన్నిబట్టి నగదు మొత్తాన్ని బండిల్‌గా సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. లబ్ధిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశాన్ని అందించాలన్నారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు. (డీఐపీఆర్‌వో, ఐ అండ్ పీఆర్, ఎన్‌టీఆర్ జిల్లా వారి ద్వారా జారీ)

## జనవరి 4న ఇబ్రహీంపట్నంలో హిందూ సమ్మేళనం..

### *హిందూ సమ్మేళనను విజయవంతం చేయవలసిందిగా కోరిన నిర్వహణ సమితి..*

**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,డిసెంబర్ 30(బ్యూరో చీఫ్ సల్మాన్:**జనవరి 4వ తేదీన ఇబ్రహీంపట్నం విటిపిఎస్ ఎ కాలనీ గ్రౌండ్ లో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ హిందువుల ఐక్యతతోనే దేశ రక్షణ సాధ్యమని తెలిపారు. ఆర్ ఎస్ ఎస్ వంద ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమాజంలో గౌరవభావం, ఏకాత్మతా పెంపొందించేందుకు ఈ సమ్మేళనం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మహా సమ్మేళనానికి ముఖ్య అతిధిగా ట్రూత్ వివేకానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ శ్రీ వివేకానంద స్వామిజీ, బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బి ఎల్ ఎన్ పవన్ తదితరులు పాల్గొంటారని, హిందూ సమాజం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. అనంతరం సభ్యులు సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు చెరుకుమల్లి సురేష్, టి వి రాంబాబు, ప్రసాద్ స్వామి,



దాము భవాని, కె. యుగంధర్, వెంకట రమణ, సారధి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ టి ఆర్ జిల్లా విజయవాడ:



విజయవాడ పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు సిపి ఎస్.వి.రాజ శేఖర బాబు ఆధ్వర్యంలో వార్షిక నేర సమీక్షా సమావేశం -2025.

ఎస్ వి రాజశేఖర్ బాబు కామెంట్స్:

సవంత్సరము కాలంలో కృషి చేసిన మీడియా వారికి కు కృతజ్ఞతలు

గత సవంత్సరము కాలంలో ప్రజలకు ఏమి హామీలు ఇచ్చాము, అవి ఎంత వరకు చేశాం

ప్రజలు అంటే మాకు చాలా ఇష్టం

సురక్ష ద్వారా 1000 కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది

నేరస్థులు అనేక రకాలుగా తెలివి తేటలు పొందారు

ప్రజలు ఎక్కువగా తిరిగే ఏరియాలలో %ఎఎ% కెమెరా లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు

డ్రోన్ లు తో అనుమానస్పద ఏరియాలో ఎక్కువగా వాడటం జరిగింది

వాటి వల్ల నేరాలు అదుపుచేయగలిగాము

2026 సవంత్సరానికి నేరాలు అదుపుచేయాలనుకుంటున్నాం

2024 గంజాయి ధర కేజీ 2000 ఉంటే ప్రస్తుతం 10000 ఉంది

ప్రాపర్టీ రికవరీ 2024 లో 51 శాతం ఉంటే 2025 లో 80 శాతం ఉంది

రోడ్ ఆక్సిడెంట్ లు 2024 లో 937

2025 లో 738

2026 లో మొత్తం ఆక్సిడెంట్స్ 366, పీడియాస్ ట్రైన్స్ 107,టు వీలర్ 209,త్రీ వీలర్ 18 ,ఫోర్ వీలర్ 13,ఇతర వెహికల్స్ 15

సైబర్ క్రైమ్ 2024 లో 4797, 8.26 కోట్లు 2025 లో 4308 సుమారు 9 కోట్లు

నార్కోటిక్స్ 2024 లో 111కేసులు,2025 లో 138

దసరా ఉత్సవాలకు సుమారు 18 లక్షలు మందిపైగా భక్తులు రావడం జరిగింది

భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందరికీ దర్శనం అయ్యే ఏర్పాటు చేయటం జరిగింది

ఆరు లక్షల మంది భవాని దీక్ష విరమణ చేశారు

ఇన్సిడెంట్, క్రైము మిస్సింగ్ కేసెస్ కాంప్రమైజ్ ఏమీ లేవు

## ఏజెన్సీలోని అంబులెన్స్‌లకు డీజిల్ సమస్య

**ప్రభుత్వం సరఫరా చేస్తున్నది 15 రోజులతో సరి**
**మిగిలిన రోజుల పరిస్థితి ఏమిటి?**
**ప్రశ్నించిన అరకు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్ని**
**మాడగడ పీహెచ్‌సీలో అందుబాటులో ఉండని వైద్యుడు**
**జడ్పీ సమావేశంలో పలు అంశాలు ప్రస్తావించిన సభ్యులు**



**క్రైం కౌంటర్ న్యూస్,** విశాఖపట్నం, డిసెంబరు 30 ప్రభుత్వం సరఫరా చేస్తున్న డీజిల్ ఏజెన్సీలోని అంబులెన్స్‌లకు 15 రోజులకే సరిపోతుందని, మిగిలిన 15 రోజుల పరిస్థితి ఏమిటని అరకు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్ని ప్రశ్నించారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన మంగళవారం జడ్పీ సమావేశమందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ అంశంపై చైర్‌పర్సన్ సుభద్ర జోక్యం చేసుకుని డీజిల్ సమస్య వల్ల అంబులెన్సులు రోడ్డెక్కకపోవడంతో గిరిజనులకు అత్యవసర వైద్యం అందడం లేదన్నారు. ఏజెన్సీకి చెందిన వారు ఎవరైనా కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోతే.. వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకురావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోష్ని చెప్పగా, విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ బదులిస్తూ.. మృతదేహాలను వెంటనే తరలించడానికి అంబులెన్స్‌లు ఏర్పాటుచేయాలని కేజీహెచ్ ప్రతినిధి చంద్రశేఖరనాయుడుని ఆదేశించారు. మాడగడ పీహెచ్‌సీలో డాక్టర్ అందుబాటులో ఉండడం లేదని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అరకు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్ని ఆరోపించగా, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ స్పందిస్తూ మాడగడ పీహెచ్‌సీలో డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో రొమ్ము క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధులబారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నదని, ఇందుకు గల కారణాలను తెలుసుకుని సత్వర వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని జడ్పీటీసీ సభ్యులు కోరారు. అనకాపల్లి జిల్లా పరిధిలో బీఎన్ రోడ్డు, వడ్డాది-పాడేరు రోడ్డు మాడుగుల మండల పరిధిలో దారుణంగా వుందని సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. అనంతగిరి, నక్కపల్లి జడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు, గోసల కాసులమ్మ మాట్లాడుతూ నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సీపీఎం నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్టు నమోదు చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేయగా.. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని దీనిపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్రం వాటా 90 శాతం కొనసాగించాలని కోరుతూ తీర్మానం చేయాలని ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదించారు. సభ ప్రారంభమైన వెంటనే కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు మృతికి సంతాపం తెలిపి, రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సమావేశంలో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజకుమార్, వైస్‌చైర్మన్లు బీవీ సత్యవతి, సుంకరి గిరిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో ఒక్కరు కూడా జడ్పీ సమావేశానికి హాజరుకాలేదు. కాగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడంలేదని, అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని జడ్పీ సమావేశంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆరోపించారు.

## కృష్ణాజిల్లా కంకిపాడు పోలీస్..




**కృష్ణాజిల్లా,** కంకిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గారు జె. మురళి కృష్ణ గారు రాబోవు సంక్రాంతి పండుగ సందర్భంగా కంకిపాడు పరిసర ప్రాంతాల్లో కోడిపందాలు, గుండాట మూడుముక్కలాట మొదలగు ఎటువంటి జూదాలకు అనుమతి లేదని తెలియజేస్తూ ముందస్తు చర్యలు చేపట్టడమైనది. ఈ కార్యక్రమంలో కంకిపాడు పోలీస్ స్టేషన్, %వా× 2 ణ% శ్రీను తాతచార్యులు గారు, పి.ఎస్.ఐ సత్యం సురేష్ గారు, ఏ.ఎస్.ఐ. అప్పారావు గారు మరియు ఇతర సిబ్బంది పాల్గొనడమైనది.

## ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు ఊరట.. రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు




**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30,** ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు ఊరటనిస్తూ రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గ్రూప్-2 రిజర్వేషన్ల అంశంపై దాఖలైన అన్ని పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. గత కొంతకాలంగా ఈ వివాదం కారణంగా నియామక ప్రక్రియపై నెలకొన్న సందిగ్ధతకు ఈ తీర్పుతో తెరపడింది. ప్రభుత్వ నిబంధనలకు లోబడే నోటిఫికేషన్ ఉందని భావించిన ధర్మాసనం, పిటిషనర్ల వాదనలతో ఏకీభవించలేదు.

2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌లోని రిజర్వేషన్ పాయింట్లను సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, రిజర్వేషన్ల అమలులో అవకతవకలు జరిగాయని వారు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా లేదని, దీనివల్ల అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్లపై గత కొన్ని నెలలుగా సుదీర్ఘ విచారణ కొనసాగింది.

ముఖ్యంగా సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని పిటిషనర్లు కోరారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో ప్రభుత్వం నిబంధనలను అతిక్రమించిందని, దీనివల్ల ఓపెన్ కేటగిరీ మరియు రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థుల మధ్య సమతుల్యత దెబ్బతిన్నదని వాదించారు. ఈ లోపాలను సరిదిద్దే వరకు నియామక ప్రక్రియను నిలిపివేయాలని లేదా కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

అయితే, ఈ వాదనలపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం తుది తీర్పును వెలువరిస్తూ పిటిషన్లను తోసిపుచ్చింది. ప్రభుత్వం అనుసరించిన రిజర్వేషన్ విధానం నిబంధనల ప్రకారమే ఉందని కోర్టు అభిప్రాయపడింది. నోటిఫికేషన్ రద్దు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, అభ్యర్థులు దాఖలు చేసిన అన్ని అభ్యంతరాలను కొట్టివేసింది. ఈ తీర్పుతో గ్రూప్-2 తదుపరి ఎంపిక ప్రక్రియ వేగవంతం కావడానికి మార్గం సుగమమైంది.

ప్రస్తుతం కోర్టు తీర్పు వెలువడటంతో ఏపీపీఎస్సీ తదుపరి చర్యలపై దృష్టి సారించనుంది. పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి చూస్తున్న వేలాది మంది అభ్యర్థులకు ఇది పెద్ద ఊరటగా మారింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో, ఉద్యోగ నియామకాల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం ముందుకు సాగే అవకాశం ఉంది. దీనివల్ల రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుంది.

## రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వర ప్రసాద్ కన్నుమూత.. విషాదంలో నియోజకవర్గం

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30,** వైఎస్సార్ కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వర ప్రసాద్ మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు అధికారికంగా వెల్లడించారు. ఆయన మృతి వార్త తెలియగానే నియోజకవర్గంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెంకటేశ్వర ప్రసాద్, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం పాటు క్రియాశీలకంగా పనిచేశారు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ, స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ అధైర్యపడకుండా నియోజకవర్గ ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యలపై పోరాడుతూ తన పట్టును నిలుపుకున్నారు. ఆయన నిబద్ధతను గుర్తించిన పార్టీ నాయకత్వం, తర్వాతి ఎన్నికల్లో మళ్ళీ ఆయనకే అవకాశం కల్పించింది. 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గుంటి వెంకటేశ్వర ప్రసాద్ కాంగ్రెస్ పార్టీ తరఫున భారీ మెజారిటీతో విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు. ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఆయన రైల్వేకోడూరు అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని స్థానిక ప్రజలు గుర్తు చేసుకుంటారు. సామాన్యులకు అందుబాటులో ఉండే నాయకుడిగా, సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న ఆయన, నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నేటికీ ఆయన గుర్తుగా నిలిచి ఉన్నాయి. వెంకటేశ్వర ప్రసాద్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలువురు రాజకీయ ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం రైల్వేకోడూరు నియోజకవర్గానికి మరియు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని వారు కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పిస్తున్నారు.



# ఘనంగా షాబుఖారి బాబా దర్గా 429వ ఉరుసు మొహత్సవం..

*వేలాదిగా తరలివస్తున్న భక్తజనం.. హైలెట్ గా నిత్యాన్నదానం కార్యక్రమం..*

*ఉరుసు మహోత్సవాల్లో పాల్గొన్న కూటమి నేతలు..*

*సంప్రదాయ పద్ధతిలో ఘనస్వాగతం పలికిన అల్తాఫ్ బాబా..*


*429వ ఉరుసు మోహోత్సవం ఏర్పాట్లపై ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశంసలు..*

*ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చొరవతో ఉరుసు మహోత్సవం గ్రాండ్ సక్సస్..*



**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి,డిసెంబర్ 30(బ్యూర్ చీఫ్ సల్మాన్):** కుల మతాలకు అతీతంగా నిర్వహించే షాబుఖారి బాబా దర్గా ఉరుసు ఎంతో మహోన్నతమైనదని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. కొండపల్లిలొని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా 429 వ ఉరుసు మహోత్సవాలకు మంగళవారం ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, కొండపల్లి మున్సిపల్ చైర్మన్-టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు లతో కలిసి పాల్గొన్నారు. ఉరుసు మహోత్సవ కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా వారిని సాదరంగా ఆహ్వానించి ఇస్లాం సంప్రదాయం ప్రకారం ఘనంగా సన్మానించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బాబా ఆశీస్సులు పొందారు. ఆ తర్వాత భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎంతో పురాతన చరిత్ర కలిగిన షాబుఖారీ బాబా దర్గా ఉరుసు మహోత్సవంలో పాల్గొనటం చాలా ఆనందంగా వుందన్నారు. ఉరుసు మహోత్సవానికి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీ సహకారంతో భక్తుల ఏటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చాలా బాగా చేశారని ప్రశంసించారు. ప్రతిరోజు భక్తులందరికీ అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల గాంధీ, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పైజాన్ లతోపాటు ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అజ్ఞాతంలో వల్లభనేని వంశీ.. పోలీసుల గాలింపు



**క్రైం కౌంటర్ న్యూస్,** కృష్ణా, డిసెంబరు 30 : గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీమోహన్ మరోసారి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. 2024 జూన్ 7వ తేదీన సునీల్ అనే వ్యక్తిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా వంశీ ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనపై మరింత తీవ్రమైన అభియోగాలు నమోదయ్యాయి. ఈ నెల 17వ తేదీన మాచవరం పోలీసులు వల్లభనేని వంశీపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు. సునీల్‌పై జరిగిన దాడి ఘటనకు సంబంధించి మొదటి నుంచే వంశీ పాత్రపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో కీలక ఆధారాలు లభించడంతో, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు మాచవరం పోలీసులు వెల్లడించారు. ఈ కేసు నమోదు తర్వాత నుంచి వల్లభనేని వంశీ పోలీసుల అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. వంశీపై కేసు నమోదు కావడం, వెంటనే ఆయన కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను పెంచుతోంది. గతంలోనూ వివాదాస్పద అంశాల్లో ఆయన పేరు వినిపించిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.ఇదిలా ఉంటే.. గతంలో గన్నవరం టీడీపీ ఆఫీసుపై వంశీ, వైసీపీ కీలక నేతలు దాడి చేశారు. ఈ కేసులో సత్యవర్ధన్ ప్రధాన సాక్షిగా ఉన్నారు. ఈ కేసు బయటకు రాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే సత్యవర్ధన్‌ను వంశీ కిడ్నాప్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులోనే ఆయన జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదల అయ్యారు. మాచవరం పోలీసులు వంశీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆయనకు సంబంధించిన సన్నిహితులు, అనుచరులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వంశీ దేశంలోనే ఉన్నారా లేక ఇతర ప్రాంతాలకు వెళ్లారా అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడు ఎంతటి రాజకీయ నేపథ్యం కలిగి ఉన్నా చట్టం ముందు అందరూ సమానమేనని పోలీసులు స్పష్టం చేశారు. వంశీని త్వరలోనే అదుపులోకి తీసుకుని విచారణ చేపడతామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారం గన్నవరం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా భద్రతపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మాచవరం పోలీసులు వెల్లడించారు.

# ఎస్‌బీఐ ద్వారా రూ. కోటి ఉచిత బీమా పరిహారం అందజేత



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30,** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య గత మార్చి నెలలో కీలకమైన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, ఎస్‌బీఐలో స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ కింద శాలరీ అకౌంట్ కలిగి ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ. కోటి విలువైన ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఉద్యోగి విధి నిర్వహణలో ఉన్నా లేదా వ్యక్తిగత పనులపై ఉన్నా, ఏదైనా ప్రమాదం జరిగి మరణం సంభవిస్తే ఈ భారీ మొత్తం వారి కుటుంబానికి ఆర్థిక భరోసాగా అందుతుంది. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత, తొలిసారిగా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఈ భారీ పరిహారం అందింది. ఎక్సైజ్ శాఖకు చెందిన పిచ్చేశ్వరరావు గత జూలై నెలలో జరిగిన ఒక దురదృష్టకర ప్రమాదంలో మరణించగా, ఆయనకు ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్ ఉండటంతో ఈ బీమా వర్తించింది. దీనికి సంబంధించిన క్లెయిమ్ ప్రక్రియ వేగంగా పూర్తి కావడంతో, ఎస్‌బీఐ అధికారులు తాజాగా రూ. కోటి రూపాయల చెక్కును మృతుని నామినీకి అందజేశారు. పథకం ప్రారంభమైన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో పరిహారం అందడం ఇదే మొదటి సందర్భం కావడం గమనార్హం. ఈ ఇన్సూరెన్స్ సౌకర్యం వల్ల ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు మరియు వారి కుటుంబాలకు అదనపు రక్షణ లభించినట్లయింది. సాధారణంగా ప్రైవేట్ బీమా కంపెనీల్లో రూ. కోటి పాలసీ తీసుకోవాలంటే భారీగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది, కానీ ఎస్‌బీఐ శాలరీ అకౌంట్ ఉన్న వారికి ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ఈ 'పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్' లభిస్తుంది. ప్రమాదవశాత్తు మరణం మాత్రమే కాకుండా, శాశ్వత అంగవైకల్యం సంభవించినా లేదా పాక్షిక వైకల్యం కలిగినా నిబంధనల ప్రకారం నిర్ణీత మొత్తం ఈ పాలసీ ద్వారా అందుతుంది. ప్రభుత్వ ఉద్యోగులు తమ శాలరీ అకౌంట్లను ఎస్‌బీఐలో నిర్వహించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఈ సంఘటన సానుకూల అవగాహన కల్పించింది. పిచ్చేశ్వరరావు కుటుంబానికి అందిన ఈ ఆర్థిక సహాయం, ఆ కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన సమయంలో కొండంత అండగా నిలిచింది. ఇతర శాఖల ఉద్యోగులు కూడా తమ అకౌంట్ వివరాలను సరిచూసుకోవాలని, నామినీ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తమ కుటుంబాలకు భద్రత కల్పించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

# తిరుమలలో భక్తులకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసాం

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30,** తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:05 గంటలకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి భక్తులకు అనుమతినిచ్చారు.ముందుగా ఆలయంలో ధనుర్మాస కైంకర్యాలు, ప్రత్యేక హారతులు, నివేదనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ జీయంగార్లు, అర్చకులు, టీటీడీ అధికారులు, పాలకమండలి సభ్యులు సంప్రదాయబద్ధంగా వైకుంఠ ద్వార ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... "అనుకున్న సమయం కంటే ముందుగానే భక్తుల కోసం దర్శనాలు ప్రారంభించాం. ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం" అని వెల్లడించారు.



# సరిహద్దుల్లో కంచె వేయలేకపోవడానికి కారణం బెంగాలే: అమిత్ షా



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30, పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 2026 అసెంబ్లీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. కోల్‌కతా పర్యటనలో ఉన్న కేంద్ర హెూం మంత్రి అమిత్ షా.. అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెంగాల్‌ను పట్టి పీడిస్తున్న చొరబాటుదారులు, అవినీతి, హింసాత్మక రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే బెంగాల్‌ను చొరబాటుదారుల నుంచి విముక్తి చేస్తామని భారీ హామీ ఇచ్చారు.

చొరబాటుదారులు.. జాతీయ భద్రతకు ముప్పు

రాష్ట్రంలోని మమతా బెనర్జీ ప్రభుత్వం తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బంగ్లాదేశీయుల చొరబాటును ప్రోత్సహిస్తోందని అమిత్ షా ఆరోపించారు. “చొరబాటు అనేది కేవలం బెంగాల్ సమస్య మాత్రమే కాదు. ఇది మొత్తం దేశ భద్రతకు సంబంధించిన అంశం. సరిహద్దుల్లో కంచె వేయడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించకుండా అడ్డుకుంటోంది. అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాల్లో చొరబాటును అడ్డుకోగలిగినప్పుడు బెంగాల్‌లో ఎందుకు జరగడం లేదు?” అని ఆయన ప్రశ్నించారు. 2026లో బీజేపీ అధికారంలోకి వస్తే చొరబాటుదారులను గుర్తించి.. వారిని రాష్ట్రం నుంచి తరిమికొడతామని స్పష్టం చేశారు.గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని.. అవినీతి, హింస రాజ్యమేలుతున్నాయని అమిత్ షా మండిపడ్డారు. “చిట్‌ఫండ్ స్కామ్‌ల నుంచి స్కూల్ జాబ్ స్కామ్‌ల వరకు, బొగ్గు నుంచి పశువుల అక్రమ రవాణా వరకు.. టీఎంసీ నాయకులు, మంత్రుల పేర్లు ప్రతి స్కామ్‌లోనూ వినిపిస్తున్నాయి. అవినీతికి పాల్పడిన మంత్రులు ఇప్పుడు జైళ్లలో ఉన్నారు. మమతా పాలనలో రాష్ట్రం ‘టోల్ సిండికేట్’కు కేంద్రంగా మారింది” అని విమర్శించారు. కేంద్రం అందించే సంక్షేమ పథకాలు కూడా బెంగాల్ ప్రజలకు అందకుండా టీఎంసీ అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్.జి. కర్ మెడికల్ కాలేజీ ఘటన, సందేశ్‌ఖాలీ ఉదంతాలను ప్రస్తావిస్తూ.. మహిళా ముఖ్యమంత్రి పాలనలోనే మహిళల భద్రత అట్టడుగు స్థాయికి పడిపోవడం దురదృష్టకరం అన్నారు. “మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ బెంగాల్‌లో పరిస్థితి చూస్తుంటే మనం మొఘల్ కాలంలో ఉన్నామా? అన్నట్లుగా ఉంది” అని ఆయన ఎద్దేవా చేశారు. 2016 నుంచి బెంగాల్‌లో బీజేపీ ఓటు శాతం, సీట్లు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయని.. 2026లో రెండు వంతుల మెజారిటీతో తమ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. శ్యామప్రసాద్ ముఖర్జీ వారసత్వాన్ని పునరుద్ధరిస్తామని, పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని.. ఏప్రిల్ 2026 తర్వాత రాష్ట్రంలో కొత్త శకం మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు.

# న్యూఇయర్.. హద్దు దాటితే కఠిన చర్యలు



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, డిసెంబరు 30 : నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పలు కఠిన ఆంక్షలను విధించింది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి వేడుకల నిర్వహణకు అనుమతులు ఇచ్చినప్పటికీ, రాత్రి 12 గంటల వరకు మాత్రమే కార్యక్రమాలకు అనుమతి ఉంటుందని విశాఖపట్నం సీపీ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెూటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బుల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు, అసాంఘిక చర్యలు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు పాల్గొన్న వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా సహించబోమని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరమంతా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 500 మంది పోలీస్ సిబ్బందితో డ్రంకెట్కన్‌డ్రైవ్ పరీక్షలు, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తామని వెల్లడించారు. అతిగా మద్యం సేవించి వాహనం నడిపితే సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైక్ సైలెన్సర్లతో హడావుడి చేస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని వెంటనే అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే ఈ వేడుకల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని ఫ్లైఓవర్లను డిసెంబర్ 31వ తేదీ రాత్రి మూసివేస్తామని ప్రకటించారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. నగర భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని.. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిక్షణం మానిటరింగ్ కొనసాగిస్తామని వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించినా లేదా వాటి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడినా అరెస్టులు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట విరుద్ధ చర్యలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని లేదా నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతియుతంగా నూతన సంవత్సర వేడుకలు సాధ్యమవుతాయని తెలిపారు. నూతన సంవత్సరంలో అనే ఉద్దేశంతో ముందుకు వెళ్లాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వేడుకల పేరుతో ప్రాణాలకు ముప్పు తెచ్చే చర్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విశాఖపట్నం సీపీ శంఖాబ్రత బాగ్చి కోరారు.

# ఏపీలో జనాభా పరంగా పెద్ద, చిన్న జిల్లాలు ఇవే

క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30, ఏపీలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. సోమవారం జరిగిన కేబినెట్ భేటీలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించగా.. మంగళవారం రోజున కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసింది. మార్కాపురం జిల్లా కేంద్రంగా మార్కాపురం జిల్లా, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తూ మంగళవారం రోజున ఉత్తర్వులు విడుదల అయ్యాయి. అలాగే.. అన్నమయ్య జిల్లా కేంద్రంగా గతంలో రాయచోటి ఉండగా.. ప్రస్తుతం జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తూ తుది నోటిఫికేషన్ విడుదల అయ్యింది. అలాగే 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాటుగా.. మండలాల సరిహద్దులు కూడా మార్పు చేస్తూ ప్రభుత్వం నుంచి తుది నోటిఫికేషన్ జారీ అయింది. రేపటి నుంచి ( డిసెంబర్ 31) కొత్త జిల్లాలు అమల్లోకి రానున్నాయి. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల సంఖ్య.. 26 నుంచి 28కి పెరగనుంది.మరోవైపు కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఏపీలో ఎక్కువ మండలాలు కలిగిన జిల్లాగా వైఎస్ఆర్ కడప జిల్లా నిలవనుంది. కడప జిల్లాలో ఇప్పటి వరకూ 36 మండలాలు ఉన్నాయి. అయితే కొత్తగా అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం కింద ఉన్న మండలాలను ప్రభుత్వం కడపలో చేర్చింది. దీంతో కడప జిల్లాలో మండలాల సంఖ్య 40కి చేరింది. ఇక జనాభా విషయానికి వస్తే ఏపీలో అత్యధిక జనాభా ఉన్న జిల్లాగా తిరుపతి నిలవనుంది. అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలో కలపటంతో.. తిరుపతి జిల్లా జనాభా 29.47 లక్షలకు చేరింది. దీంతో రాష్ట్రంలో అత్యధిక జనాభా కల్గిన జిల్లాగా తిరుపతి గుర్తింపు దక్కించుకుంది. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గాన్ని విభజించి..పోలవరం జిల్లా ఏర్పాటు చేశారు. 12 మండలాలు, మూడున్నర లక్షల మంది జనాభాతో పోలవరం జిల్లా.. జనాభా పరంగా రాష్ట్రంలో అతి చిన్న జిల్లాగా నిలుస్తోంది. మరోవైపు మదనపల్లె జిల్లా కేంద్రంగా కొనసాగనున్న అన్నమయ్య జిల్లాలో 24 మండలాలు ఉన్నాయి.

# ప్రోటోకాల్ పాటించరా.. జడ్పీలో సభ్యుల ఆందోళన

క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 30, ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షులు ఆరోపించారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన మంగళవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అనకాపల్లి మండలాధ్యక్షుడు సూరిబాబు ప్రోటోకాల్ వ్యవహారాన్ని ప్రస్తావించారు. అనకాపల్లి మండలంలో అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవానికి స్థానిక సర్పంచ్, ఎంపీపీ,



జడ్పీటీసీ సభ్యురాలి ఆహ్వానించ లేదని, దీనిపై సీడీపీవోకు లేఖ రాస్తే అసలు భవనమే ప్రారంభం కాలేదని లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారన్నారు. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు మాట్లాడుతూ తన సొంత గ్రామం తానాంలో ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందలేదని పేర్కొనడంతో వైసీపీ సభ్యులు మూకుమ్మడిగా లేచి పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. సభ్యుల ఆందోళనతో చైర్‌పర్సన్ ఏకీభవిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలకు తననూ ఆహ్వానించడం లేదన్నారు. సభ్యుల ఆవేదనపై అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణణ్ స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ప్రోటోకాల్ పాటించాల్సిందేని పేర్కొన్నారు. అధికారులు అందుకు అనుగుణంగా వ్యవహరించాలని ఆదేశించారు.

క్రికెటర్ కరుణకుమారికి సన్మానం అంధ మహిళల టీ20 వరల్డ్ కప్‌ను గెలుచుకున్న భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అల్లూరి సీతారామరాజు జిల్లా వాసి పాంగి కరుణకుమారిని జడ్పీ హాలులో సత్కరించారు. జిల్లా పరిషత్ తరపున చైర్‌పర్సన్ సుభద్ర రూ.39,900 విలువ గల క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, దినేష్‌కుమార్, జడ్పీ సీఈవో నారాయ ణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజకుమార్, జడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

# ఇలా చేస్తే మీ పార్టీ సమాధే.. జగన్‌పై మంత్రి కొల్లు ఫైర్



క్రైం కౌంటర్ న్యూస్, ప్రకాశం, డిసెంబర్ 30: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం , ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారని మండిపడ్డారు. రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామని.... లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# వారి దాహం తీర్చేది ఊటనీరే!



క్రైం కౌంటర్ న్యూస మక్కువ రూరల్, డిసెంబరు 30: మండల కేంద్రానికి కేవలం 19 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మెండంగి గిరిశిఖర గ్రామస్థులకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. వారి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ఆ ప్రాంతవాసులకు కొండపై నుంచి వచ్చే ఊటనీరే జీవనాధారంగా మారింది. కాగా ఈ కలుషిత నీటి కారణంగా తరచూ రోగాలపాలవుతున్నారు. మరోవైపు ఏటా వేసవిలో కొండల నుంచి నీరు రాకపోవడంతో ఆ గ్రామస్థులు తాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. మెండంగితో పాటు చిలకమెండంగి, బాగుజోల, బెలుగొండ తదితర గిరిజన గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై ఆయా ప్రాంతవాసులు ఎన్నిసార్లు అధికారులకు విన్నవిస్తున్నా.. ఫలితం శూన్యం. కనీస చర్యలు తీసుకోకపోవడంతో వారు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పనసభద్ర పంచాయతీ పరిధి మెండంగి గిరిశిఖర గ్రామంలో 115 కుటుంబాలు నివసి స్తున్నాయి. ఇక్కడ సుమారు 400 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో రక్షిత నీటి పథకం లేదు. దీని ఏర్పాటుకు అవకాశాలున్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేసుకోవడం లేదు. ప్రభుత్వాలు మరుతున్నా.. ప్రజాప్రతినిధులు కూడా దీనిపై చొరవచూపడం లేదు. దీంతో గ్రామ స్థులు కొండలపై నుంచి వచ్చే ఊటనీటినే తాగునీటిగా వినియోగించాల్సి వస్తోంది. గ్రామానికి కిలోమీటరున్నర దూరంలో కొండపై నుంచి వచ్చే ఊట నీటిని ఒడిసిపట్టి పైపులద్వారా ట్యాంక్ నింపుతున్నారు. అందులో చేరిన నీరు కుళాయిల ద్వారా సరఫరా అయ్యే విధంగా గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. వర్షాకాలంలో ఊటనీటికి ఏ ఇబ్బంది లేకపోగా.. వేసవిలో మాత్రం ఆ ప్రాంతవాసులకు దాహార్తి తప్పడం లేదు. ఎండాకాలంలో ఊట నీరు ఇంకిపోవడంతో తాగు నీటికి వారు కటకటలాడాల్సి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి.. తాగునీటి ఇక్కట్లు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నా.. ఎవరికీ పట్టడం లేదు. ఊట నీటితో అనారోగ్య పాలవుతున్నామని..కనీసం బోరు ఏర్పాటు చేయాలని గ్రామపెద్దలు రెండేళ్ల కిందట అధికారు లను కోరారు. దీంతో గ్రామానికి పడమర భాగంలో బోరు ఏర్పాటు చేశారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. కొద్దిరోజులు బాగానే పనిచేసిన బోరు ఆ తర్వాత మొరాయించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేసవి రాకమునుపే తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీఎంకే రెడ్డిని వివరణ కోరగా.. ఆ గ్రామాన్ని సందర్శించి సమస్యను తెలుసుకుంటామన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సినిమా



## తరుణ్ సినిమాలు మానేయడానికి కారణం అదే.

తెలుగు సినిమా పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన హీరో తరుణ్. ఎన్నో ప్రేమకథ చిత్రాలతో హిట్స్ అందుకున్నాడు. దాదాపు పదేళ్లపాటు బ్యాక్ టూ బ్యాక్ విజయాలను ఖాతాలో వేసుకుని.. అప్పట్లో యూత్ ఫేవరేట్ గా నిలిచాడు. అప్పట్లో లవ్ స్టోరీ సినిమాలతో ట్రెండ్ సెట్ చేసిన తరుణ్.. ఇప్పుడు మాత్రం సినిమాలకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తరుణ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు ఆయన తల్లి రోజా రమణి. 1967లో బాలనటిగా సినీరంగ ప్రవేశం చేసి, హీరోయిన్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా 54 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని కొనసాగించారు. ప్రహ్లాద వంటి పాత్రలతో పేరుపొందిన ఆమె, 500 పైగా చిత్రాలకు డబ్బింగ్ చెప్పి, ఎందరో హీరోయిన్లకు ప్రాణం పోశారు.హీరోయిన్‌గా, సహాయ నటిగా పలు భాషల్లో వందలాది చిత్రాలలో నటించిన ఆమె, వివాహం తర్వాత డబ్బింగ్ కళాకారిణిగా కొనసాగారు. 500 పైగా చిత్రాలకు డబ్బింగ్ చెప్పి, దాదాపు 400 మంది హీరోయిన్లకు ఆమె గాత్రాన్ని అందించారు. ముగ్గురు మొనగాళ్ళు చిత్రంలో ముగ్గురు హీరోయిన్లకు (నగ్మా, రోజా, రమ్యకృష్ణ) వేర్వేరు వాయిస్ మోడ్యులేషన్స్‌తో డబ్బింగ్ చెప్పడం ఆమె ప్రతిభకు నిదర్శనం. నరేష్, హరీష్ వంటి నటుల లేడీ గెటప్‌లకు కూడా ఆమె డబ్బింగ్ చెప్పడం విశేషం. తెలుగు సినీ పరిశ్రమలో ఐదు దశాబ్దాలకు పైగా తనదైన ముద్ర వేసిన ఒక రోజారమణి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన కొడుకు గురించి చెప్పుకొచ్చింది.వివాహం తర్వాత, ఆమె నటనకు విరామం ఇచ్చి, డబ్బింగ్ రంగంలోకి ప్రవేశించారు. అనుకోకుండా మొదలైన ఈ ప్రయాణం 500 పైగా చిత్రాలకు గాత్రాన్ని అందించే స్థాయికి చేరింది. సుహాసిని, రమ్యకృష్ణ, మీనా, రోజా, దివ్యభారతి, శిల్పాశెట్టి, దీప్తి భట్నాగర్, మీనాక్షి శేషాద్రి, ఖుష్బూ వంటి సుమారు 400 మంది ప్రముఖ హీరోయిన్లకు ఆమె డబ్బింగ్ చెప్పారు. నటనకు విరామం ఇవ్వడం తన వ్యక్తిగత నిర్ణయమేనని, భర్త చక్రపాణి గానీ, ఇతర కుటుంబ సభ్యులు గానీ ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ఒకప్పుడు హీరోగా స్టార్ డమ్ సంపాదించుకున్న తన తనయుడు తరుణ్ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉండేందుకు గల కారణాలను వెల్లడించారు. తరుణ్ ఇప్పుడు వ్యాపారరంగంలో బిజీగా ఉన్నారని.. తన దృష్టిని కేవలం బిజినెస్ పై పెట్టారని అన్నారు. అటు సినిమాలతోపాటు.. ఇటు వ్యాపారరంగంలోనూ సక్సెస్ అయ్యారంటూ చెప్పుకొచ్చారు.





## ఇది తెలిస్తే అస్సలు ముట్టుకోరు..

మూర్ఛ బ్రెయిన్‌కు సంబంధించిన ఒక వ్యాధి. మెదడు పనితీరుకు సంబంధించి ఏదైనా ఆటంకం ఏర్పడినప్పుడు ఫిట్స్ వస్తుంది. ఫిట్స్ వచ్చినప్పుడు.. అవయవాలు వణకడం, ఆకస్మికంగా పడిపోవడం, తదేకంగా చూడటం, ఆందోళన, స్పృహ కోల్పోవడం, సైకోసిస్ వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు వైద్యులు. ఫిట్స్ చిన్న వయసులో బాధించడానికి పలు కారణాలని అంటున్నారు. అలాగని.. పెద్దయ్యాక రాదని చెప్పలేం. ఇది జీవితంలో ఎప్పుడైనా రావొచ్చంటున్నారు నిపుణులు. ఇది వారసత్వంగా తల్లితండ్రుల నుంచి సంక్రమిస్తుందా? ఆహారం ద్వారా మెదడులోకి చేరే పురుగులు కారణమా?

తల్లిదండ్రులకు మూర్ఛ సమస్య ఉంటే అది పిల్లలకు వచ్చే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు. కొన్నిసార్లు మూర్ఛ వ్యాధిగ్రస్థులను ఆసుపత్రికి తీసుకెళ్లినా.. చికిత్స చివరి వరకు కొనసాగించకుండా మధ్యలోనే వదిలేస్తారంటున్నారు. ఈ కారణంగా వ్యాధి మరింత తీవ్రంగా మారుతుంది. అలాకాకుండా.. సమయానికి చికిత్స అందిస్తే 80 నుంచి 90 శాతం మూర్ఛ రోగులలో ఈ వ్యాధి కంట్రోల్ అవుతుందని చెబుతున్నారు. అలాగే క్యాబేజ్ ఆకులను వండకుండా పచ్చిగా తినడం వల్ల టీనియా సోలియం అనే పురుగు గుడ్లు మెదడులోకి చేరతాయని వాటి కారణంగా ఏర్పడే ఇన్ఫెక్షన్ తో మూర్ఛవ్యాధి రావచ్చని హెచ్చరించారు. న్యూరో సిస్టి సెర్కోసిస్ నివారించదగ్గ ఇన్‌ఫెక్షన్ అని ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక సెహ్రావత్ తెలిపారు. ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే ఈ సమాచారాన్ని మేం మీకు అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.



## మద్యం, పాలు కలిపి తాగితే ఏమవుతుంది?

మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం.. ఈ విషయం అందరికీ తెలుసు.. కానీ.. ఈ ప్రపంచంలో మద్యం తాగేవారు చాలా మంది ఉన్నారు. భారతదేశంలో కూడా లక్షలాది మంది తమ అభిరుచికి తగ్గట్టుగా మద్యం తాగుతారు. కొంతమంది వివిధ రకాల ఆల్కహాల్‌లను కలిపి తాగుతారు. మరికొందరు.. ఆల్కాహాల్ తో పాటు వాటర్, సోడా, డ్రింక్స్, జ్యూస్‌లు, కొబ్బరినీరు.. ఇంకా కొన్ని డ్రింక్స్ ను కలుపుకుని తాగుతారు.. నిజానికి, మద్యం తాగే విషయంలో ప్రజలకు అనేక ప్రాధాన్యతలు ఉంటాయి.

కానీ ఈ తరహా మద్యం తాగడం వల్ల కొన్నిసార్లు శరీరంపై చెడు ప్రభావం చూపుతుంది. అదేంటంటే.. మద్యం, పాలు తాగడం.. కొందరు పాలు తాగిన వెంటనే మద్యం తాగుతారు. మరికొందరు మద్యం తాగే ముందు పాలు తాగుతారు. ఇది శరీరాన్ని ఖచ్చితంగా ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకుందాం..

పాలు తాగిన వెంటనే మద్యం, బీరు తాగడం వల్ల చాలా మంది శరీరాలపై ప్రభావం ఉండదు. అయితే, కొంతమందికి జీర్ణ సమస్యలు రావచ్చు. మద్యం %-% బీరు, పాలు కలిపి తాగడం వల్ల కొన్నిసార్లు ఉబ్బరం, వాంతులు వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల, అలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నా.. లేదా ఎప్పుడైనా బాధపడి ఉంటే.. పాలు, మద్యం కలిపి తాగకుండా ఉండండి.

పాలు తాగడం వల్ల ఆల్కహాల్ శోషణ మందగిస్తుందని కొందరు అంటున్నారు. కానీ ఇది ఆమ్లత్వం, ఉబ్బరానికి దారితీస్తుంది. కాబట్టి, సరైన జాగ్రత్తలు తీసుకోండి. ముఖ్యంగా, ఇప్పటికే ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పాలు, ఆల్కహాల్ తాగడానికి ప్రయత్నించకూడదు.

పాలు తాగిన కొన్ని గంటల తర్వాత మద్యం తాగడం వల్ల శరీరంపై ఎటువంటి ప్రతికూల ప్రభావాలు ఉండే అవకాశం తక్కువ. అందువల్ల, పాలు %-% ఆల్కహాల్ మధ్య దూరం ఉంచడం మంచిది.. పాలు తాగితే, తాగేటప్పుడు తక్కువ ఆల్కహాల్ కంటెంట్ ఉన్న ఆల్కహాల్‌ను ఎంచుకోండి. సోడా లేదా కార్బోనేటేడ్ పానీయాలు తాగడం మానుకోండి. అసలు ఇలా చేయడం కూడా కరెక్ట్ కాదు..

గమనిక.. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం. మేము మద్యం సేవించడాన్ని ప్రోత్సహించడం లేదు. ఏదైనా ప్రయోగాన్ని ప్రయత్నించే ముందు దయచేసి నిపుణుడిని సంప్రదించండి..



## ఆస్ట్రేలియా నుంచి అఫ్రిదీ అవుట్..

పాకిస్థాన్ స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదీకి ఆస్ట్రేలియా గడ్డపై గట్టి షాక్ తగిలింది. బిగ్ బాష్ లీగ్?లో మెరుపులు మెరిపిద్దామని వెళ్లిన ఈ స్పీడ్‌స్టర్, అనూహ్యంగా గాయం బారిన పడి టోర్నీ నుంచి అర్ధాంతరంగా వైదొలిగాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆదేశాల మేరకు అతను ఆస్ట్రేలియాను వీడి స్వదేశానికి బయలుదేరాడు. ఫిబ్రవరి-మార్చి నెలల్లో భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ దృష్ట్యా రిస్క్ తీసుకోవడం ఇష్టం లేక పీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది.

బ్రిస్బేన్ హీట్ జట్టు తరపున ఆడుతున్న షాహీన్ అఫ్రిదీకి, డిసెంబర్ 27న అడిలైడ్ స్ట్రైకర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయమైంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో 14వ ఓవర్లో అతని కుడి మోకాలికి తీవ్రమైన నొప్పి రావడంతో, అతను మైదానంలోనే కుంటుతూ కనిపించాడు. కనీసం తన ఓవర్‌ను కూడా పూర్తి చేయలేక మధ్యలోనే డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. మోకాలి గాయం తీవ్రతను గమనించిన పీసీబీ, అతనికి సరైన చికిత్స అందించేందుకు వెంటనే పాకిస్థాన్‌కు తిరిగి రావాలని కోరింది. తన నిష్క్రమణపై షాహీన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "బ్రిస్బేన్ హీట్ టీమ్, ఫ్యాన్స్ చూపించిన ప్రేమకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఊహించని గాయం వల్ల బోర్డు నన్ను వెనక్కి పిలిచింది. త్వరలోనే మళ్ళీ మైదానంలోకి వస్తానని ఆశిస్తున్నాను. అప్పటి వరకు నా టీమ్‌కు బయట నుంచే మద్దతు ఇస్తాను" అని పేర్కొన్నాడు. ఫిబ్రవరిలో జరగబోయే వరల్డ్ కప్ నాటికి షాహీన్ ఫిట్‌నెస్ పాక్ జట్టుకు చాలా కీలకం. అందుకే పీసీబీ మెడికల్ టీమ్ పర్యవేక్షణలో అతనికి చికిత్స అందించనున్నారునిజానికి ఈసారి బిగ్ బాష్ లీగ్ షాహీన్ అఫ్రిదీకి అస్సలు కలిసిరాలేదు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో అతను కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయగలిగాడు. పైగా అతని ఎకానమీ రేటు 11.19గా ఉంది, అంటే బ్యాటర్లు అతడిని చితక్కొట్టారు. డెబ్యూ మ్యాచ్‌లోనే వరుసగా రెండు బీమర్లు (హై ఫుల్ టాస్) వేసినందుకు అంపైర్లు అతడిని బౌలింగ్ నుంచి తొలగించారు. ఆరంభంలోనే అపశ్రుతి ఎదురైన షాహీన్, ఇప్పుడు గాయంతో సీజన్ మొత్తానికి దూరం కావడం అతని ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేస్తోంది.



## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో షెఫాలీ వర్మ జోరు: టాప్-10లో ముగ్గురు భారత స్టార్ ప్లేయర్లు!

ఐసీసీ (%×జజ%) విడుదల చేసిన తాజా మహిళా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత యువ ఓపెనర్ షెఫాలీ వర్మ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో నిలకడగా రాణించడమే కాకుండా, తనదైన శైలిలో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఈ ఫామ్ ప్రభావంతో ఆమె తన కెరీర్ ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పారు.

తాజా ర్యాంకింగ్స్ గణాంకాలను పరిశీలిస్తే, షెఫాలీ వర్మ ఏకంగా నాలుగు స్థానాలు ఎగబాకి 736 పాయింట్లతో 6వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారు. శ్రీలంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగుల వర్షం కురిపించడంతో ఆమె ఖాతాలో భారీగా రేటింగ్ పాయింట్లు వచ్చి చేరాయి. మైదానంలో ఆమె చూపిస్తున్న దూకుడు మరియు ఆత్మవిశ్వాసం టీమ్ ఇండియాకు రాబోయే మెగా టోర్నీల్లో పెద్ద ప్లస్ పాయింట్ కానుంది.

షెఫాలీ వర్మతో పాటు టీమ్ ఇండియాకు చెందిన మరో ఇద్దరు స్టార్ ప్లేయర్లు టాప్-10లో చోటు దక్కించుకోవడం విశేషం. భారత వెటరన్ బ్యాటర్ స్మృతి మంధాన 767 పాయింట్లతో రెండో స్థానాన్ని పదిలం చేసుకోగా, మరో మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 643 పాయింట్లతో పదో స్థానంలో నిలిచారు. ఒకేసారి ముగ్గురు భారత క్రీడాకారిణులు ప్రపంచ అత్యుత్తమ 10 మంది బ్యాటర్ల జాబితాలో ఉండటం భారత మహిళా క్రికెట్ ఎదుగుదలకు నిదర్శనం.

మొత్తంగా ఈ ర్యాంకింగ్స్ జాబితాను చూస్తే, ఆస్ట్రేలియాకు చెందిన స్టార్ ప్లేయర్ బెత్ మూనీ 794 పాయింట్లతో అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఆమె తర్వాతి స్థానాల్లో భారత్, ఇంగ్లాండ్ మరియు న్యూజిలాండ్ క్రీడాకారిణులు గట్టి పోటీని ఇస్తున్నారు. రాబోయే సిరీస్‌లలో మన భారత క్రీడాకారిణులు ఇదే జోరును కొనసాగిస్తే, అగ్రస్థానానికి చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com